క్లుప్తంగా

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు



ఇది అతని సంతకం నాటకంలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో భాగంగా సోమవారం ప్రదర్శించిన రెండు నాటికలు ఆకట్టుకున్నాయి. తొలి ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే 'ఇది అతని సంతకం', రెండో నాటకంగా శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారిచే 'జనరల్ బోగీలు' ప్రదర్శించారు. రాజగోపాల్ చౌదరి, బ్రహ్మానందం, అధ్యక్షులు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, కళాభారతి కోశాధికారి పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి నాటకాలను ప్రారంభించారు.

ముగిసిన కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యావేత్తలతో ఆచార్యులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో రెండు వారాల పాటు నిర్వహించిన కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం సోమవారంతో ముగిసింది. 'వన్ ఇండియా–డిజిటల్ ఇండియా' పేరిట అంబేడ్కర్ ఆశయాల సాధనలో భాగంగా విద్యాభివృద్ధి కోసం విస్తృతమైన సమీక్ష చేశారు. వివిధ అంశాల్లో విద్యావేత్తలు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖులు భాగస్వామ్యులయ్యారు. డాక్టర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్, కోర్స్ డైరెక్టర్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రోగ్రాంలో పాల్గొన్న వారికి ఈ సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు.

డ్రైవర్ అక్రమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ రిలే దీక్షలు



రిలే దీక్షలు ప్రారంభించిన యూనియన్ నాయకులు

ఎంవీపీకాలనీ: వాల్తేర్ ఆర్టీసీ డిపో పరిధిలో డ్రైవర్‌గా విధులు నిర్వరిస్తున్న పీసీహెచ్ శేఖర్ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిపో పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. గత నెలలో ఇద్దరు డ్రైవర్ల మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణ కారణంగా శేఖర్‌ను డిపో యాజమాన్యం సస్పెండ్ చేసింది. దీంతో శేఖర్ హైకోర్టును సైతం ఆశ్రయించగా.. ఇటీవల అతడికి అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చింది. సస్పెన్షన్‌ను కోర్టు ఎత్తివేయడంతో పాటు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సూచించింది. అయినప్పటికీ డిపో ఉన్నతాధికారులు విధుల్లోకి తీసుకోకపోవడాన్ని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేఎం నాయుడు తప్పుబట్టారు. డిపో ఉన్నతాధికారుల తీరును నిరసిస్తూ సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు తెలిపారు. అధికారులు దిగి వచ్చే వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షురాలు ఎ.సీతాలక్ష్మి, వైఎస్సార్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్సీ రావు, యూనియన్ నాయకులు బీఏ రాజు, కేవీ బాబు, ఎంఈ రావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

'క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ'పై మేధో చర్చ

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సోమ వారం 'క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై ఆన్‌లైన్ విధానంలో రౌండ్ టేబుల్ మేధో చర్చ నిర్వహించారు. ఐఐటీ ఖరగ్‌పూర్ కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సుదేబ్‌కుమార్ ప్రశాంత్ పాల్ పాల్గొని క్వాంటం సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ దిశగా ఏయూ చొరవ చూపుతూ విభిన్న రంగాల నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి మేధో చర్చ నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయా లని ఇటీవల ప్రకటించిందని, అదే విధంగా ఉన్నత విద్యా మండలి సైతం క్వాంటం సైన్స్‌కు ప్రాధా న్యం కల్పించాలని సూచించినట్లు తెలిపారు. ఈ రంగంలో విభిన్న ఇంజినీరింగ్ సైన్స్ విభాగాలు సమష్టిగా పనిచేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు. సదస్సులో జేఎన్టీయూహెచ్ సీనియర్ ప్రొఫెస ర్ డాక్టర్ ఎస్.విశ్వనాథరాజు, పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ విశాల్ గోయల్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ రుక్మా రేఖ, జేఎన్టీయూ ఆచార్యులు డాక్టర్ సుమలత, డాక్టర్ జయసుమ, ఏయు ఆచార్యులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో ఎకో బజార్



ఆర్కే బీచ్ రోడ్డులో మత్స్యదర్శిని పక్కన వసతులకు నోచుకోని ఎకో బజార్



టేకుతో చెక్కిన బుద్ధుని ప్రతిమ

- బీచ్ రోడ్డులో పర్యావరణ హిత ఉత్పత్తుల విక్రయాలు
- అధికారుల ప్రోత్సాహం.. ప్రచారం లేక ఆదరణ కరువు
- దుకాణాల వద్ద వసతులు శూన్యం
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు



ఎకో బజార్ దుకాణంలో విక్రయిస్తున్న ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో పర్యావరణ హిత ఉత్పత్తులను విక్రయించాలనే ఉద్దేశంతో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఎకో బజార్‌పై అధికారులు దృష్టి సారించడం లేదు. ఆర్కే బీచ్‌కు సమీపంలో మత్స్యదర్శిని పక్కనే గతంలో మూడు దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటిలో ప్రస్తుతం ఒక్కటి మాత్రమే వినియోగంలో ఉంది. కేవలం సాయంత్రం వేళల్లో మాత్రమే దీనిని తెరుస్తున్నారు. ఎకో బజార్‌కు తగిన ప్రచారం, ప్రోత్సాహం కల్పిస్తే లక్ష్యం పూర్తి స్థాయిలో సాకారమయ్యే అవకాశముంది.

ప్రభుత్వం ప్రోత్సహించాలి

ఇక్కడ విక్రయిస్తున్న ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు ఎంతో కళాత్మకంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలు, సదస్సుల్లో అతిథులకు బహుమతులుగా అందించడానికి ఇటువంటి ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహిస్తే ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. జ్యూట్ బ్యాగ్‌లను సైతం ఇక్కడ విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేస్తూ ప్రభుత్వం తగిన ప్రోత్సాహం కల్పించాలి.



అట్టతో చేసిన పెన్నులు



జ్యూట్ బ్యాగ్‌లు

కళాత్మకంగా ఉత్పత్తులు

ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, చిన్నారులు ఆడుకోవడానికి ఉపయుక్తంగా నిలిచే బొమ్మలతో పాటు అలంకరణకు వినియోగించే బొమ్మల వరకు ఇక్కడ అందుబాటులో ఉంచారు. అట్టతో తయారు చేసిన పెన్నులు ప్రత్యేకంగా విక్రయిస్తున్నారు. చెక్కతో చేసిన పెన్ స్టాండ్, టేకుతో చెక్కిన గౌతమ బుద్ధుడి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సువాసనలు వెదజల్లే అగరబత్తీలు, ధూప్ స్టిక్స్ ప్రత్యేకంగా విక్రయిస్తున్నారు. జాతీయ స్థాయిలో మంచి అవార్డులు సాధించిన ఈ ఉత్పత్తులను ప్రత్యేక స్టాల్‌లో విక్రయిస్తున్నారు.

ఈ చర్యలు చేపట్టాలి

ఎకో బజార్‌లోని దుకాణాలకు వెళ్లే మెట్లు శిథిలమయ్యాయి. దీంతో వినియోగదారులు దుకాణం వద్దకు రావడానికి కొంత ఇబ్బంది పడుతున్నారు.



విరిగిన ఎకో బజార్ దుకాణం మెట్లు

జీవీఎంసీ అధికారులు మెట్లకు మరమ్మతులు చేయించి, దుకాణాలకు సులభంగా చేరుకునేలా ఏర్పాట్లు చేయాలి. ఉదయం వేళల్లో సైతం తెరిచేలా దుకాణం ఎదురుగా నీడనిచ్చే షెడ్లు నిర్మించాలి. పక్కనే ఉన్న మరో రెండు దుకాణాలను వినియోగంలోకి తీసుకురావాలి. కొంత రాయితీ కల్పించి, ఉత్పత్తులను సరసమైన ధరలకు విక్రయిస్తే నగర ప్రజల నుంచే కాకుండా.. పర్యాటకుల నుంచి కూడా మంచి ఆదరణ లభిస్తుంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు వినియోగదారులు, సందర్శకులు కోరుతున్నారు.

వసతులు.. ప్రచారం నిల్

ఇక్కడి దుకాణంలో ఏటికొప్పాక బొమ్మలు, జ్యూట్ బ్యాగ్‌లు, చెక్కతో చేసిన వస్తువులు, ధూప్ స్టిక్స్, అగరబత్తీలు విక్రయిస్తున్నారు. దుకాణం వద్ద కనీస మౌలిక వసతులు లేవు. ప్రస్తుతం ఈ దుకాణం సాయంత్రం వేళలో మాత్రమే తెరుస్తున్నారు. ఉదయం ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో తెరవలేకపోతున్నారు. దుకాణాల వద్ద నీడనిచ్చే



సీతారాముల ఏటికొప్పాక బొమ్మ

షెడ్ వంటి నిర్మాణం జరిపితే కొంత ఉపయుక్తంగా నిలుస్తుంది. ఇక్కడ వస్తువులకు ప్రచారం సైతం కల్పించాల్సిన అవసరం ఉంది.

పోలమాంబ జాతరకు సర్వం సిద్ధం





విద్యుద్దీప కాంతుల్లో పోలమాంబ దేవాలయం

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ దేవస్థానం మంగళవారం జరగబోయే ప్రధాన జాతరకు సిద్ధమైంది. దేవాలయ మొత్తం విద్యుత్ కాంతులతో దగదగ మెరుస్తోంది. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి విశాఖ ఐ ఆస్పత్రి వరకు విద్యుత్ దీపాలంకరణతో రహదారి కాంతులీనుతోంది. పోలమాంబ జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా జరిగింది. భక్తులు తెల్లవార్లు వీధుల్లో తిరుగుతూ అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.

250 మంది పోలీసులతో పటిష్ట భద్రత

జాతర సమయంలో ఎటువంటి సంఘటలు జరగకుండా ఉండేందుకు పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన జాతర భద్రతపై సమీక్షించారు. ట్రాఫిక్ ఇబ్బందులు, పార్కింగ్ సమస్యలు లేకుండా శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. మొత్తం జాతర కోసం 250 మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. అందులో లా అండ్ ఆర్డర్ 130, క్రైం 40, ట్రాఫిక్ 80 మందిని వినియోగిస్తున్నామన్నారు.



దేవస్థానం వద్ద విధుల్లో త్రీ టౌన్ సీఐ పైడయ్య

మహోన్నతుడు అంబేడ్కర్‌కు మనసారా నివాళి

- 'తూర్పు'లో ఘనంగా బాబాసాహెబ్ జయంతి వేడుకలు
- అంజలి ఘటించిన ప్రజలు, నాయకులు

ఆరిలోవ: భారత రాజ్యాంగ నిర్మాత, మహోన్నతుడు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు సోమవారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఆరిలోవ, ఆదర్శనగర్, విశాలాక్షినగర్ ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజలు, రాజకీయ నాయకులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు నివాళులర్పించారు.

దిశానిర్దేశకుడు అంబేడ్కర్: మేయర్

జీవీఎంసీ 12వ వార్డు ఆరిలోవ అంబేడ్కర్ కూడలి వద్ద అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సేవా సంఘం సభ్యులు, మార్కెటింగ్ కమిటీ జిల్లా మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబుతో కలసి ఆమె అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అంబేడ్కర్ భారతదేశానికి రాజ్యాంగం రూపంలో దిశానిర్దేశం చేశారన్నారు. దేశ భవిష్యత్‌ను ఆలోచించి రాజ్యాంగాన్ని రచించారన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎస్.నర్సింగరావు, రమేష్, సత్యనారాయణ, మోహన్‌రావు, మధుసూధనరావు, శాంతిస్వరూప్, మురళీ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

➡ పెదగదిలిలో టీడీపీ నాయకులు అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. విశాఖ ఎంపీ ఎం.భరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్థానిక నాయకులతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. విశాలాక్షినగర్‌లో టీడీపీ నాయకులు ఎ.రాంబాబు, వేజెల్ల సుబ్బరాజు పాల్గొన్నారు.

సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో..

సీపీఎం ఆధ్వర్యంలో 13వ వార్డు రామకృష్ణపురంలోని అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, జోన్ నాయకులు, గ్రామ సంఘం సభ్యులతో కలసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షుడు వంకర బాబూరావు, కాకర గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

➡ ఆరిలోవ అంబేడ్కర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెహమాన్, విమల నాయకులతో కలిసి నివాళులర్పించి, నినాదాలు చేశారు. పార్టీ నాయకులు లక్ష్మణరావు, దేవుడమ్మ, చిరంజీవి, రవి, పుష్ప పాల్గొన్నారు.



భానోజీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎంపీ గొల్ల బాబూరావు



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎన్ఎంయూఏ నేత శ్రీనివాసరావు

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో..

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాల, పరిపాలన భవనం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహాలకు ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ అసెంబ్లీ మందిరంలో నిర్వహించిన సమావేశంలో వీసీ ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల అంజలి ఘటించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని ఏయూ ఎస్సీ, ఎస్టీ, బీసీ–సీ టీచర్స్ ఎంప్లాయిస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి.షారోన్ రాజు ఏయూ వీసీ రాజశేఖర్‌కు బహుకరించారు. కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య కే.సీతామాణిక్యం, దూరవిద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, ఆచార్య జాన్, పలువురు విశ్రాంత ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

➡ న్యాయ కళాశాలలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.



వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కమిషనర్ విశ్వనాథన్



22వ వార్డులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పీతల గోవింద్

ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్–9 ప్రగతి భవన్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబాసాహెబ్ చిత్రపటానికి ముఖ్య అతిథి కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇగ్నో ఆధ్వర్యంలో..

స్థానిక ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం విశాఖ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారావు పూలమాల వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ దేశానికి, ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇగ్నో ఉప సంచాలకుడు కృష్ణారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో..

మద్దిలపాలెం: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో మద్దిలపాలెం రామ్మోహన్ భవన్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి ముఖ్య అతిథి ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.



12వ వార్డులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఈడీ సత్యపద్మ

ఎస్.మూర్తి, డివిజన్ కార్యదర్శి ఎ.కె.శివాజీ, మద్దిలపాలెం డిపో అధ్యక్ష, కార్యదర్శులు పి.చిన్న, ఎం.ఈశ్వరరావు, జిల్లాలోని అన్ని డిపోల నాయకులు, గ్యారేజీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

సీఐటీయూ ఆధ్వర్యంలో మద్దిలపాలెంలోని సింహాద్రిపురం, ఆదర్శనగర్, రెల్లి వీధి, సిద్ధార్థ నగర్ ప్రాంతాలతోపాటు జీవీఎంసీ వార్డు కార్యాలయాల వద్ద అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ మద్దిలపాలెం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.ఆర్. నాయుడు, పి.వెంకటరావు మాట్లాడుతూ మే 20న దేశ వ్యాప్తంగా లేబర్ కోడ్ల రద్దు, ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణకు చేపట్టనున్న కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు, దండు నాగేశ్వరరావు, కె.కుమారి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల నివాళి

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు భానోజీనగర్‌లో ఆది ఆంధ్ర గ్రామోద్ధరణ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు పూలమాల వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు పరిశీలకుడు మొల్లి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పల సురేష్, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

➡ జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలోని బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు.



ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ రాజశేఖర్



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇగ్నో అధికారులు, చిన్నారులు



ఆరిలోవలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

అన్ని వర్గాల సమ్మేళనం అంబేడ్కర్ చలవే..

విశాఖ సిటీ: దేశంలో విభిన్న మతాలు, జాతులు, సంస్కృతులు సమ్మేళనంగా మనగలుగుతున్నాయంటే అది రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చలవేనని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధాన గణాంకాధికారి హరిప్రసాద్, పరిపాలనాధికారులు నాగభూషణం, రమణ, విజయలక్ష్మి, విద్యాసాగర్, ప్లానింగ్ అధికారి అరుణవల్లి పాల్గొన్నారు.

ఏయూక్యాంపస్: చినవాల్తేరు రెల్లివీధిలో అంబేడ్కర్ చిత్రపటానికి సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, రెల్లివీధి అధ్యక్షుడు చెన్నా అశోక్ పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ స్థాయి బాక్సర్ చెన్న అప్పలరాజును సత్కరించారు. కుల వివక్ష పోరాట కమిటీ నాయకుడు అనపర్తి అప్పారావు, దండు నాగేశ్వరరావు, వై.కృష్ణ, పి.సీతారత్నం, కుమారి పాల్గొన్నారు.



ఏయూ వీసీ రాజశేఖర్‌కు పుస్తకాన్ని బహూకరిస్తున్న ఆచార్య షారోన్ రాజ్



రామకృష్ణాపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



రెల్లి వీధిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జూలో నల్ల హంసల సందడి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో నల్ల హంసలు సందర్శకులను అలరిస్తున్నాయి. జూ ప్రధాన ద్వారం ఎదురుగా మొదటి ఎన్‌క్లోజర్ వీటిదే. సందర్శకులకు ఇవి ప్రధాన ద్వారం నుంచి ప్రవేశించగానే ఎదురుగా కనిపిస్తాయి. ఇందులో 10కి పైగా నల్ల హంసలున్నాయి. వీటి ఎన్‌క్లోజర్ మధ్యలో రెండు నీటి కుండీలున్నాయి. వాటిలో హంసలు ఒకదాని వెంట మరొకటి పోటీపడుతూ ఈత కొడుతుంటాయి. ఒడ్డుకు చేరుకొని పరుగులు పెడుతూ రోజూ సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. ఇవి కొలను నీటిలో వాటి పొడవైన మెడ లోపలకు ముంచుతూ తల కిందులుగా కాళ్లు పైకి లేపుతూ సందడి చేస్తున్నాయి. యానిమల్ కీపర్లు వాటికి ట్రేలలో ఆహారం ఇస్తుంటారు. గింజలు, వివిధ రకాల పండ్ల ముక్కలు వేస్తారు. వాటిని తింటూ నల్ల హంసలు హుషారుగా ఎన్‌క్లోజర్‌లో తిరుగుతుంటాయి.

